సాక్షి ఖమ్మం

శనివారం, 24, మే, 2025



పాఠశాలల్లో ప్రవేశాలు పెరగాలి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు పెరిగేలా ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలని డీఈఓ సత్యనారాయణ సూచించారు. 10లో



వల పన్ని.. పట్టుకున్నారు !

ఖమ్మం స్టేషన్‌లో బ్రిడ్జి పైనుంచి దూకుతానని వ్యక్తి హల్‌చల్ చేయగా.. పోలీసులు కింద వల వేసి పట్టుకుని కాపాడారు. 10లో



వాతావరణం

జిల్లాలో శనివారం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. కొన్ని ప్రాంతాల్లో చిరుజల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాల్సిందే..



చెక్‌పోస్ట్ వద్ద పరిశీలిస్తున్న అదనపు డీసీపీ

బోనకల్/నేలకొండపల్లి: పశువుల అక్రమ రవాణాను నియంత్రించేలా ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలని అడిషనల్ డీసీపీ ప్రసాదరావు ఆదేశించారు. బోనకల్ మండలం పాలడుగుతో పాటు జిల్లాలోని పలుచోట్ల ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌లను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు డీసీపీ మాట్లాడుతూ చెక్‌పోస్ట్‌ల వాహనాలను తనిఖీ చేస్తూ అన్ని పత్రాలు సరిగ్గా ఉన్నాయా, లేదా అని పరిశీలించాలని, అక్రమంగా రవాణా చేస్తున్నట్లు తేలితే వాహనాలను సీజ్ చేయాలని తెలిపారు. అలాగే, నేలకొండపల్లి పోలీసుస్టేషన్‌కు వచ్చిన అదనపు డీసీపీ ప్రసాదరావు రికార్డులను పరిశీలించాక శాంతిభద్రతల పరిరక్షణ, కేసుల విచారణపై ఉద్యోగులకు సూచనలు చేశారు. పాత నేరస్తుల కదలికలపై నిఘా వేయాలని ఆదేశించారు.

శారీరక శిక్షణ, ఆయుధ విజ్ఞానం



అధికారులతో మాట్లాడుతున్న కల్నల్ సచిన్ అంబాల్కర్

వైరా: వైరాలోని న్యూలిటిల్ ఫ్లవర్స్ స్కూల్‌లో ఏర్పాటుచేసిన 11(బీ) బెటాలియన్ ఎన్‌సీసీ వేసవి శిక్షణ శిబిరం కొనసాగుతోంది. ఈ శిబిరాన్ని వీరచక్ర అవార్డు గ్రహీత, వీఆర్‌సీ గ్రూప్ కమాండర్ కల్నల్ సచిన్ అన్నారావు సెంబాల్కర్ శుక్రవారం సందర్శించారు. కల్నల్ ఎస్‌కే.భద్ర, కల్నల్ నవీన్‌యాదవ్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న శిబిరంలో భాగంగా కేడెట్లకు శారీరక శిక్షణ, ఆయుధాల పనితీరుపై అవగాహన కల్పిస్తూనే నాయకత్వ లక్షణాలపై ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గ్రూప్ కమాండర్ మాట్లాడుతూ ఎన్‌సీసీ శిక్షణతో సంఘ జీవనం, ప్రభుత్వ కార్యకలాపాలపై అవగాహన పెరగడమే కాక దేశభక్తి పెరుగుతుందని తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ పి.భూమేష్‌రావు, డైరెక్టర్ కుర్రా సుమన్, అపురూపాదేవి తదితరులు పాల్గొన్నారు.

కోచ్‌ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ మోడల్ స్పోర్ట్స్ స్కూళ్లలో ఔట్ సోర్సింగ్ పద్ధతిపై ఏడాది కాలానికి కోచ్‌లను నియమించనున్నట్లు ఐటీడీఏ పీఓ బి.రాహుల్ తెలిపారు. కిన్నెరసానిలో మోడల్ స్పోర్ట్స్ స్కూల్‌లో ఆర్చరీ కోచ్, కాచనపల్లిలోని మోడల్ స్పోర్ట్స్ స్కూల్‌లో కబడ్డీ కోచ్ ఎంపికకు ఎన్ఎస్, ఎన్ఐఎస్‌లో డిప్లొమా పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ధ్రువపత్రాలతో ఈనెల 26నుంచి జూన్ 3వ తేదీ వరకు ఐటీడీఏలోని స్పోర్ట్స్ ఆఫీసర్ కార్యాలయంలో వ్యక్తిగతంగా కానీ dtdo.bhadradri@gmail.com మెయిల్ ద్వారా కానీ దరఖాస్తులు పంపించాలని సూచించారు. వివరాలకు 98489 88205, 99123 62053 నంబర్లకు సంప్రదించాలని పీఓ తెలిపారు.

అంతులేని చెత్త సమస్య



వైరా సుదూర ప్రాంతానికి చెత్త తరలిస్తున్న వాహనం (ఇన్‌సెట్) కల్వర్టు నిర్మించాల్సిన ప్రాంతం ఇదే..

వైరా మున్సిపాలిటీలో డంప్ యార్డు ఇక్కట్లు

- మిగతా మూడుచోట్ల సేకరణ, తరలింపులో నిర్లక్ష్యం
- వర్షాకాలం వస్తే మరింత ఇబ్బందులు

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

వైరా: వైరా మున్సిపాలిటీ ఏర్పడి ఏడేళ్లు అవుతోంది. అయినా సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కారం కాలేదు. కొన్నాళ్ల క్రితం వరకు రహదారులు, సైడ్ డ్రెయిన్లు సరిగ్గా లేక స్థానికులు ఇబ్బందులు ఎదుర్కోగా అందుకు నిధులు విడుదల కావడంతో కొంత మేర ఇక్కట్లు తీరాయి. ఇక చెత్త సేకరణ, డంపింగ్ యార్డుల ఏర్పాటు మాత్రం ఓ కొలిక్కి రావడం లేదు. దీంతో ఇంటింటా వెలువడే చెత్త సేకరిస్తున్నా డంపింగ్‌కు సరైన ప్రదేశాలు గుర్తించక, గుర్తించినా వాహనాలు వెళ్లే మార్గం లేక సమస్య ఎటూ తేలడం లేదు. అయితే, ఇది కేవలం వైరాలో మాత్రమే కాదు జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలనూ వేధిస్తోంది.

కలెక్టర్లే పరిశీలించినా...

వైరాలో 20 వార్డులకు గాను సుమారు 40వేల జనాభా ఉండగా, ప్రతీరోజు 8 – 10 టన్నుల చెత్త విడుదలవుతోంది. ఈ చెత్త సేకరణకు ఎనిమిది ఆటో రిక్షాలు, ఎనిమిది ట్రాక్టర్లు వినియోగిస్తున్నారు. కానీ సేకరించిన చెత్తను ఎక్కడ వేయాలో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. నాలుగేళ్లలో ఇద్దరు, ముగ్గురు కలెక్టర్లు ఈ సమస్యపై దృష్టి సారించినా, ఏడాదిన్నర క్రితం స్థలం కేటాయించినా ఉపయోగం లేక పోయింది. సదరు స్థలానికి చెత్త తీసుకెళ్లేలా సరైన మార్గం లేకున్నా, ఇది పట్టణానికి ఐదు కి.మీ. దూరంలో ఉన్నా అష్టకష్టాలకోర్చి చెత్త తరలిస్తుండడంతో డీజిల్ ఖర్చులు పెరిగాయి.

వర్షాకాలం వస్తే ఇక్కట్లే

రెండేళ్లుగా వైరా సమీపంలోని స్టేజీ పినపాక హైలెవల్ వంతెన కింద చెత్త వేస్తూ నిప్పుపెడుతున్నారు. దీంతో ప్రయాణికులు, స్థానికులకు అసౌకర్యంగా మారింది. ఈమేరకు ఏడాదిన్నర క్రితం రిజర్వాయర్ అలుగుల సమీపాన తల్లాడ మండలం కొడవటిమెట్ట రెవెన్యూలో మూడెకరాల స్థలాన్ని డంపింగ్ యార్డుకు కేటాయించారు. కానీ ఇక్కడకు చెత్త తరలించాలంటే క్రాస్ రోడ్డు నుండి రిజర్వాయర్ ఆనకట్ట కింది భాగం మీదుగా వెళ్లాలి. ఈ మార్గంలో మూడు అలుగు వాగులు ఉండడంతో వర్షాకాలంలో రిజర్వాయర్ నీటి మట్టం 18.4 అడుగులు చేరిందంటే వరద ప్రవహిస్తుంది. ఫలితంగా రెండు నెలలు ప్రత్యామ్నాయం వెతకాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. కాగా, రహదారి మెరుగుపరిచేలా పలు ప్రతిపాదనలు రూపొందించారు. మూడు వాగులపై కల్వర్టులు లేదా బ్రిడ్జి నిర్మించడంతో పాటు మెటల్ రోడ్డు నిర్మాణానికి రూ.1.7 కోట్లు, అవసరమైన చోట సీసీ రోడ్డు వేస్తూ చప్టాలు నిర్మించాలంటే రూ.2 కోట్లు, కల్వర్టులతో పాటు బీటీ రోడ్డు వేయాలంటే రూ.2.5 కోట్లకు పైగా అవసరమని ప్రతిపాదించారు. దీనికి అనుమతులు వచ్చినా వానాకాలంలో చెత్త తరలించాలంటే ప్రహసనంగానే మారనుంది. మరోచోట 2–3 ఎకరాల స్థలం కొనాలంటే ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చే పరిస్థితి లేదు. ఇవన్నీ కాక రిజర్వాయర్‌ను ఆనుకుని ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకుంటే సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనున్నందున అధికారులు ఆ దిశగా ఆలోచన చేయాలని పలువురు కోరుతున్నారు.



ఏదులాపురంలో మరమ్మతుకు గురైన వాహనాలు

మిగతా మున్సిపాలిటీల్లో...

- మధిర మున్సిపాలిటీలో డంపింగ్ యార్డు ఉన్నా సరిపడా సిబ్బంది లేక వైరా నదికి అనుకోని రోడ్డు వెంటే ఖాళీ స్థలాల్లో చెత్త వేస్తున్నారు. మున్సిపాలిటీ మొత్తం వారానికోసారి చెత్త సేకరిస్తున్నారు. వచ్చేది వర్షాకాలం కావడంతో ప్రతిరోజు చెత్త తరలించకపోతే దుర్వాసన వస్తుందని స్థానికులు వాపోతున్నారు.
- సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కొమ్మేపల్లిలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేశారు. ఇది పట్టణానికి సుమారు మూడు కి.మీ. దూరాన ఉండడంతో కార్మికులు రహదారుల వెంటే చెత్త వేస్తున్నారు.
- ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీ ఈ ఏడాది ఫిబ్రవరిలో ఏర్పడింది. ప్రస్తుతం 20 వాహనాలు ఉన్నా సగానికి పైగా మరమ్మతులతో మూలనపడ్డాయి. దీంతో పూర్తిస్థాయిలో చెత్త సేకరణ జరగడంలేదు. ఒకవేళ సేకరించినా రహదారుల వెంట, మున్నేరు ఒడ్డున డంప్ చేస్తున్నారు. ఇటీవల పల్లెగూడెంలో డంపింగ్ యార్డుకు స్థలాన్ని పరిశీలించినా అధికారిక ఉత్తర్వులు వెలువడలేదు.

జిల్లాలోని మున్సిపాలిటీల వివరాలు

మున్సిపాలిటీ	వార్డులు	జనాభా	రోజువారీ చెత్త (టన్నుల్లో)	వాహనాలు
వైరా	20	40,000	10	16
సత్తుపల్లి	23	38,000	11	15
మధిర	22	35,000	20	17
ఏదులాపురం	32	60,000	10	20

సమస్యను అధిగమిస్తాం..

వైరాలో డంప్ యార్డుకు గుర్తించిన స్థలం పట్టణానికి దూరంగా ఉంది. అక్కడే చెత్త డంప్ చేస్తుండగా, సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. కలెక్టర్ ఆదేశాలతో తుది నిర్ణయం ఉంటుంది. ఈ మార్గంలో కల్వర్టుల నిర్మాణానికి అంచనాలు రూపొంచినందున త్వరలోనే సమస్యను అధిగమిస్తాం.

– చింతల వేణు, మున్సిపల్ కమిషనర్, వైరా



దళారులకు నయాపైసా ఇవ్వొద్దు..

- ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి
- ఎమ్మెల్యే రాగమయితో కలిసి ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ

సత్తుపల్లిటౌన్/వేంసూరు: ఇళ్లు మంజూరు చేయిస్తాని ఎవరైనా నమ్మబలికినా నయాపైసా ఇవ్వొద్దని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి సూచించారు. ఈ విషయంలో ప్రతిపక్షాలు చేసేవన్నీ తప్పుడు విమర్శలేనని.. తమ ప్రభుత్వంలో అర్హులందరికీ ఇళ్లు మంజూరవుతాయని ఆయన తెలిపారు. సత్తుపల్లిలో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో మున్సిపాలిటీ, మండలానికి సంబంధించి 574 మందికి, వేంసూరులో జరిగిన కార్యక్రమంలో 570మందికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయితో కలిసి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుండడాన్ని బీఆర్‌ఎస్ నాయకులు ఓర్వలేక తప్పుడు విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. గత పదేళ్లలో రైతుబంధు తప్ప ఏ పథకాన్ని సక్రమంగా అమలుచేయలేదని చెప్పారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతు రుణమాఫీ, ఉచిత విద్యుత్, ఉచిత బస్సు ప్రయాణం, సన్న బియ్యం పంపిణీ, సన్న ధాన్యం రైతులకు బోనస్ ఇస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే రాగమయి మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి తర్వాత మళ్లీ ఇప్పుడే పేదలకు ఇళ్లు మంజూరవుతున్నాయని చెప్పారు. ప్రతీ పథకంలో అర్హుల ఎంపిక పారదర్శకంగా చేపడుతున్నందున, ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని నమ్మొద్దని సూచించారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ కె.నర్సింహ, ఆర్‌డీఓ రాజేంద్రగౌడ్, హౌసింగ్ డీఈఈ విక్రమం, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీఓ నాగేశ్వరరావు, నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, దోమ ఆనంద్‌బాబు, భాగం నీరజ, గాదె చెన్నారావు, చల్లగుళ్ల నర్సింహారావు, ఎం.డీ.కమల్‌పాషా, మందపాటి ముత్తారెడ్డి, తోట సుజలరాణి, ఉడతనేని అప్పారావు, చల్లగుండ్ల కృష్ణయ్య, చల్లారి వెంకటేశ్వరరావు, నారాయణవరపు శ్రీనివాస్, కాసరి చంద్రశేఖర్‌రెడ్డి, పుచ్చకాయల సోమిరెడ్డి, అట్లూరి సత్యనారాయణరెడ్డి, మందపాటి రాఘవరెడ్డి, ఎం.డీ.షైజుద్దీన్, ఎం.డీ.ఫకృద్దీన్, బొమ్మనబోయిన వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సత్తుపల్లిలో ఇళ్ల మంజూరు పత్రాలు అందచేస్తున్న ఎంపీ రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే రాగమయి

పేదలందరికీ ఇళ్లే లక్ష్యం

పెనుబల్లి : పేదల సొంతింటి కల నెరవేర్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి తెలిపారు. పెనుబల్లిలో మండల పరిధిలోని 599 మందికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశాక ఆమె మాట్లాడారు. ఐదేళ్లలో సత్తుపల్లి నియోజకవర్గంలో 20 – 25 వేల ఇళ్ల మంజూరుకు ప్రణాళికాయుతంగా పనిచేస్తున్నామని తెలిపారు. కల్లూరు ఆర్డీఓ రాజేంద్రగౌడ్, ఎంపీడీఓ అన్నపూర్ణ, కల్లూరు, సత్తుపల్లి మార్కెట్ చైర్మన్లు భాగం నీరజాచౌదరి, దోమ ఆనందబాబుతో పాటు మట్టా దయానంద్, రాజబోయిన కోటేశ్వరరావు, పి.వెంకటేశ్వరరావు, కీసర శ్రీనివాసరెడ్డి, బుక్కా కృష్ణవేణి, గోదా రాములు, మేకతొట్టి కాంతయ్య, మాలోతు రాధాకృష్ణ పాల్గొన్నారు.

స్వర్ణకవచాలంకరణలో రామయ్య దర్శనం

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామచంద్ర స్వామి శుక్రవారం స్వర్ణకవచాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున అర్చకులు గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావచనం జరిపించారు. ఆ తర్వాత స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్య కల్యాణ వేడుకను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భూసేకరణ పూర్తి చేయాలి

ఆర్ అండ్ ఆర్ కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ఆర్ అండ్ ఆర్ కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి పెండింగ్ భూసేకరణపై సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మున్నేటి తీరాన నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్, సీతారామ ఎత్తిపోతల పథకం, జాతీయ రహదారులకు అవసరమైన భూ సేకరణ సకాలంలో పూర్తిచేస్తేనే పనులకు ఆటంకాలు రావని తెలిపారు. ఈ విషయంలో రైతులు, నిర్వాసితులతో నేరుగా చర్చించి వారికి నచ్చచెప్పాలని సూచించారు. అలాగే, సీతారామ ఎత్తిపోతల పథకంలో భాగంగా యాతాలకుంట టన్నెల్, పాలేరు రిజర్వాయర్ లింక్, డిస్ట్రిబ్యూషన్ కెనాళ్లకు అవసరమైన భూసేకరణపైనా సూచనలు చేశారు. కాగా, భూసేకరణ, రైతులకు పరిహారం అందించే అంశంలో మానవీయ కోణంలో వ్యవహరిస్తూ ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని తెలిపారు. ఈసమావేశంలో ఇరిగేషన్ ఎస్ఈ ఎం.వెంకటేశ్వర్లు, ఆర్డీఓలు జి.నర్సింహారావు, ఎల్.రాజేంద్రగౌడ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి

అథ్లెటిక్స్ ఎంపిక పోటీలకు 124మంది

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లాస్థాయి అండర్–8, 10, 12 బాలబాలికల అథ్లెటిక్స్ జట్ల ఎంపికకు శుక్రవారం ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో పోటీలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ కేటగిరీల్లో 124 మంది హాజరుకాగా, ఇందులో బాలురు 86, బాలికలు 38 మంది ఉన్నారు. ఈసందర్భంగా రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే జట్ల ఎంపికకు వీరికి వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. పోటీలను అథ్లెటిక్స్ కోచ్ ఎం.డీ.గౌస్ పర్యవేక్షించగా ఎం.డీ.షఫీక్, మందుల వెంకటేశ్వర్లు, సుధాకర్, కృష్ణయ్య, రవి, వెంకటేశ్వర్లు, ప్రియాంక పాల్గొన్నారు.

కటకటాల్లోకి కర్ణాటక కేటుగాడు

డిజిటల్ అరెస్ట్ పేరిట జిల్లా వాసి నుంచి రూ.1.12 కోట్లు స్వాహా

ఖమ్మంక్రైం: మనీ లాండరింగ్ కేసు నమోదైంది.. డిజిటల్ అరెస్ట్ చేస్తున్నాం.. అంటూ బెదిరిస్తూ జిల్లా కేంద్రానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి నుంచి రూ.1.12 కోట్లు కాజేసిన కర్ణాటక రాష్ట్రానికి చెందిన నిందితుడిని ఖమ్మం సైబర్ విభాగం పోలీసులు అరెస్ట్ చేశారు. ఈమేరకు వివరాలతో పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ఖమ్మం టీచర్స్‌కాలనీకి చెందిన నాగుల బ్రహ్మంకు గత ఏడాది అక్టోబర్‌లో ఫోన్ చేసిన అజ్ఞాత వ్యక్తి మనీలాండరింగ్ కేసు నమోదైందంటూ నకిలీ డాక్యుమెంట్లను వీడియోకాల్‌లో చూపించారు. ఇలా భయపెడుతూనే కేసు నుంచి బయట పడేయడానికి డబ్బు చెల్లించాలని పలు దఫాలుగా రూ.1.12 కోట్లు వివిధ ఖాతాల్లోకి జమ చేయించుకున్నాడు. చివరకు మోసపోయినట్లు గుర్తించిన బ్రహ్మం ఫిర్యాదుతో ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కర్ణాటక రాష్ట్రంలోని హుబ్లీకి చెందిన మహ్మద్ జాఫర్ బెల్గాంను నిందితుడిగా గుర్తించి అక్కడకు వెళ్లి అరెస్ట్ చేశారు. ఆపై ట్రాన్సిట్ వారెంట్ ద్వారా ఖమ్మం తీసుకొచ్చి కోర్టులో హాజరుపర్చినట్లు సీపీ తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేయడంలో కీలకంగా వ్యవహరించిన సైబర్ క్రైమ్ డీఎస్పీ ఫణీందర్, ఎస్ఐలు రంజిత్, విజయ్‌కుమార్, ఉద్యోగులను సీపీ అభినందించారు.

రండీ.. త్వరపడండి!

- టీఎంఆర్‌ఈఐఎస్‌ల్లో శరవేగంగా ప్రవేశాలు
- జిల్లాలో ఏడు పాఠశాలలు, ఒక కాలేజీ
- గత ఏడాది ఉత్తమ ఫలితాలు రావడంతో విద్యార్థుల ఆసక్తి

ఖమ్మంమయూరిసెంటర్: మైనార్టీల కోసం ప్రత్యేకంగా స్థాపించిన రెసిడెన్షియల్ పాఠశాలల్లో తెలంగాణ మైనార్టీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ(టీఎంఆర్‌ఈఐఎస్) ద్వారా 2025–26 విద్యాసంవత్సరానికి ప్రవేశాల ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. ఈనెల 31వ తేదీ వరకు ప్రవేశాలకు అవకాశముంది. అన్ని పాఠశాలల్లో ఐదో తరగతిలో ప్రవేశాలు కల్పిస్తుండగా, 6నుంచి 9వ తరగతి వరకు ఖాళీ సీట్లు మాత్రమే భర్తీ చేస్తారు. ఇక జూనియర్ కళాశాలలో ఇంటర్‌కు సంబంధించి ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీలో సీట్లు అందుబాటులో ఉన్నాయి. అయితే, సీట్ల వరకే దరఖాస్తులు వస్తే నేరుగా ప్రవేశాలు కల్పించనుండగా, అంతకు మించి దరఖాస్తులు అందితే మాత్రం డ్రా విధానాన్ని పాటించనున్నారు.

మైనార్టీలకు ఉచిత విద్య

టీఎంఆర్‌ఈఐఎస్‌ల ద్వారా వేలాది మంది మైనార్టీ పిల్లలకు ఉచిత విద్య, హాస్టల్ వసతితో పాటు ఆధునిక కంప్యూటర్ విద్య, క్రీడలు, నైపుణ్య శిక్షణ అందుతున్నాయి. గత విద్యాసంవత్సరం ఈ పాఠశాలల్లో ఎస్సెస్సీ విద్యార్థులు 95.37 శాతం, ఇంటర్ విద్యార్థులు 85.32 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇతర ప్రభుత్వ గురుకులాలతో సమానంగా ఫలితాలు సాధించడంతో పాటు పోటీ పరీక్షల్లో సత్తా చాటేలా తీర్చుతుండడంతో నీట్, ఐఐటీ–జేఈఈ, ఒలింపియాడ్, క్రీడాపోటీల్లోనూ ప్రతిభ చాటుతున్నారు.

ప్రవేశాలకు ఆహ్వానం..

విద్య, సమానత్వం, సామాజిక న్యాయాన్ని అత్యున్నత ప్రాధాన్యతగా తీసుకుంటూ మైనార్టీల కోసం టీఎంఆర్‌ఈఐఎస్‌లను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రఘునాథపాలెంలో ఖమ్మం గర్ల్స్–1(శారద ఇంజనీరింగ్ కళాశాల), ఖమ్మంలోని అల్లిపురం రోడ్డులో ఖమ్మం గర్ల్స్–2, కొణిజర్లలో ఖమ్మం బాయ్స్–1(పులిపాటి ప్రసాద్ ఇంజనీరింగ్ కాలేజీ), సత్తుపల్లి గుడిపాడు రోడ్డులో సత్తుపల్లి బాయ్స్–1, జలగంనగర్‌లో నేలకొండపల్లి బాయ్స్–1, సింగరేణిలోని ఎస్ఆర్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీలోని వైరా గర్ల్స్–1, మధిర మండలం జీలుగుమాడులోని మధిర బాయ్స్–1 పాఠశాలలు కొనసాగుతున్నాయి. ఇక ఖమ్మం రాపర్తినగర్‌లోని జూనియర్ కళాశాల(ఖమ్మం గర్ల్స్–1) ప్రవేశాలు కొనసాగుతున్నాయి.



సద్వినియోగం చేసుకోవాలి..



టీఎంఆర్‌ఈఐఎస్ విద్యాసంస్థల్లో ప్రవేశాలు వేగంగా సాగుతున్నాయి. ఐదో తరగతికి అన్ని పాఠశాలల్లో సీట్లు అందుబాటులో ఉండగా, 6 – 9వ తరగతికి మాత్రం ఖాళీల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తాం. ఈనెల 31లోగా సీట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలి.

– డాక్టర్ బి.పురంధర్, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి

ఎల్‌ఆర్‌ఎస్‌కు తిప్పలెన్నో..

- అధికారుల చుట్టూ ప్లాట్లదారుల ప్రదక్షిణలు
- నిషేధిత స్థలం కాకున్నా జాబితాల్లోకి..
- యజ్ఞంలా మారిన పరిశీలన, అనుమతులు

ఖమ్మం అర్బన్: స్థలాల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్(ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం)ను ప్రవేశపెట్టగా దరఖాస్తులదారుల వెసులుబాటు కోసం ఇటీవల ఫీజులో 25శాతం రాయితీ ప్రకటించింది. దీంతో తమ స్థలాలను క్రమబద్ధీకరించుకోవచ్చని, తద్వారా నిర్మాణానికి ఇక్కట్లు తీరతాయని భావించిన దరఖాస్తుదారులకు అడుగడుగునా అవాంతరాలు ఎదురవుతున్నాయి. గతంలో రూ.వెయ్యి చెల్లించి దరఖాస్తు చేసుకున్న వారిని ప్రస్తుతం నిర్దేశిత ఫీజులో 25 శాతం రాయితీకి అర్హులుగా ప్రకటించారు. కానీ ప్రభుత్వం రూపొందించిన యాప్‌లో సాంకేతిక సమస్యలో లేక ఇతర కారణాలో తెలియదు కానీ యజమానులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ఫీజు చెల్లింపునకు అనుమతి జారీ కావడం లేదు.

దశల వారీగా...

ఎల్–1 దరఖాస్తులకు సంబంధించి కార్పొరేషన్ లేదా గ్రామపంచాయతీ అధికారులతో పాటు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అంతా సవ్యంగా ఉంటే యాప్‌లో అప్‌లోడ్ చేసి అనుమతి ఇస్తున్నారు. కానీ నిషేధిత జాబితాలో చేర్చిన భూముల విషయంలో ఇక్కట్లు ఎదురవుతున్నాయి. మూడు శాఖల అధికారులకు ఒకేసారి సమయం లభించి క్షేత్రస్థాయికి వస్తేనే ప్లాట్ ప్రభుత్వ భూమిలో ఉందా, ఎఫ్‌టీఎఫ్ పరిధిలో ఉందా అనేది నిర్ధారించే అవకాశముంటుంది. ఇందుకోసం దరఖాస్తుదారులు అధికారుల చుట్టూ తిరిగి యాప్‌లో నమోదు చేయించుకున్నా... తిరిగి మరోమారు అనుమతి కోసం క్షేత్రస్థాయికి రావాల్సి ఉండడంతో కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇదంతా పూర్తయ్యాక ఎల్–2(టౌన్ ప్లానింగ్), ఎల్–3(ముఖ్య అధికారి జారీ చేసే పత్రం) దశల్లోనూ విపరీతమైన జాప్యం జరుగుతోందని చెబుతున్నారు. ఇదంతా భరించలేక కొందరు తాము చెల్లించిన డబ్బు తిరిగి ఇచ్చేయాలని అధికారులను నిలదీస్తున్నట్లు సమాచారం. ఇదే అదనుగా కొందరు అంత దూరం రావాలంటే ఖర్చులు అవుతాయని డబ్బు డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.



ప్లాట్ వద్దే యాప్‌లో ఫొటో అప్‌లోడ్ చేస్తున్న పంచాయతీ కార్యదర్శి

రెండేసి సార్లు

కొన్ని ప్లాట్లకు సమీపాన ప్రభుత్వ భూమి, అసైన్డ్ భూములు లేదా వాగులు, వర్రెలు ఉంటే ఈ భూమిని కూడా నిషేధిత(ప్రొహిబిటెడ్) జాబితాలో చేర్చినట్లు సమాచారం. ఎప్పుడో కొనుగోలు చేసిన ప్లాట్లను నిషేధిత జాబితాలో చేర్చడం ఏమిటని ప్లాట్ల యజమానులు వాపోతున్నారు. ఇలాంటి ప్లాట్లను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాకే రాయితీతో ఫీజు చెల్లింపునకు అనుమతి ఇస్తుండడం గమనార్హం. అంతా పూర్తయి ఫీజు చెల్లించినా అనుమతి పత్రం కోసం మరోమారు ఉన్నతాధికారుల చుట్టూ తిరగాల్సి వస్తుండడం గమనార్హం.

మీ సేవ కేంద్రాలకు పరుగులు

ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న సమయంలోనే యజమానులు అన్ని పత్రాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. కానీ ఇప్పుడు మరోమారు అప్‌లోడ్ చేయాలని ప్లాట్లదారులకు సమాచారం వస్తోంది. దీంతో నెట్ సెంటర్లు, మీ సేవ సేవా కేంద్రాలకు పరుగుల తీయక తప్పడం లేదు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ ఫీజు చెల్లింపునకు అవకాశం ఇవ్వాలని, ఆ వెంటనే అనుమతులు జారీచేయాలని పలువురు కోరుతున్నారు.

క్లుప్తంగా

సెలవుల్లోనే బదిలీలు, పదోన్నతులు పూర్తిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

నేలకొండపల్లి: ప్రస్తుత వేసవి సెలవుల్లోనే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ నిర్వహించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. నేలకొండపల్లిలో జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ శిబిరం వద్ద శుక్రవారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం విద్యారంగాన్ని మరింత బలోపేతం చేసేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే, పెండింగ్‌లో ఉన్న బిల్లులు, 2008 డీఎస్సీ కాంట్రాక్ట్ ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించాలని కోరారు. కాగా, ఉపాధ్యాయులు సైతం ఈ నెల 25 నుంచి జరిగే బడిబాట ద్వారా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంపునకు కృషిచేయాలని తెలిపారు. టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బుర్రి వెంకన్న, జిల్లా కోశాధికారి వల్లంకొండ రాంబాబు, జిల్లా కార్యదర్శి సురేశ్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జ్యోతి, టి.గురవయ్యతో పాటు డి.అరుణ, నాసరయ్య, శ్రీనివాసరావు, కరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థికి చేయూత



విద్యార్థికి చెక్కు అందజేస్తున్న ఫౌండేషన్ బాధ్యులు

కల్లూరు: కల్లూరుకు చెందిన గంపల ఉమాసాయిదీపక్ యాదాద్రి భువనగిరి జిల్లాలో ఇంజనీరింగ్ మూడో సంవత్సరం చదువుతుండగా, పేద కుటుంబం కావడంతో ఫీజు చెల్లించేందుకు ఇబ్బంది పడుతున్నాడు. ఈ విషయమై స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధి వరకా రామారావును సంప్రదించగా, ఆయన చైర్మన్ శ్రీవ్యాల్ దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో ఫౌండేషన్ మెంబర్ వావిలాల తేజస్విని సమక్షాన శుక్రవారం ఉమాసాయిదీపక్‌కు రూ.1.08 లక్షల చెక్కు అందజేశారు. ఈ మేరకు విద్యార్థి తల్లిదండ్రులు గంపల శ్రీనివాసరావు, పద్మ ఫౌండేషన్ బాధ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



అమ్మవారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: మండల పరిధిలోని కేశవాపురం–జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) అమ్మవారికి అర్చకులు శుక్రవారం పంచామృతాభిషేకం చేశారు. ముందుగా అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతాలు, పసుపు, కుంకుమ, గాజులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం చేశాక నివేదన, హారతి, నీరాజన మంత్రపుష్పం సమర్పించారు. అనంతరం కుంకుమపూజ, గణపతి హోమం నిర్వహించారు. కార్యక్రమంలోఈఓ ఎన్.రజనీకుమారి, అర్చకులు పాల్గొన్నారు.

జిల్లాకు సీతారామ జలాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్

ములకలపల్లి: సీతారామ ప్రాజెక్ట్ జలాలు జిల్లా సాగు భూములకు ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని 48.30 కి.మీ. వద్ద కూలిన పాసేజ్ పిల్లర్ ప్రదేశాన్ని శుక్రవారం ఆయన సందర్శించి మాట్లాడారు. నాసిరకం నిర్మాణం వల్లే పిల్లర్ కూలిందని ఆరోపించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రధాన కాలువలతోపాటు డిస్ట్రిబ్యూటరీ కాల్వల నిర్మాణాలు తక్షణమే పూర్తి చేయాలన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు అన్నవరపు కనకయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ, జిల్లా నాయకుడు కొండబోయిన వెంకటేశ్వర్లు, పార్టీ మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, ఊకంటి రవికుమార్, నిమ్మల మధు, గొగ్గెల ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.


పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,058

వేతనాలు వచ్చేదెప్పుడో..?

- కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల ఎదురుచూపులు
- నాలుగు నెలలుగా జీతం అందక ఇక్కట్లు
- సర్వీస్ పునరుద్ధరణపైనా నీలినీడలు



ఖమ్మంసహకారనగర్: 2008లో వారంతా డీఎస్సీ అర్హత సాధించారు. రకరకాల కారణాలతో పోస్టింగ్ ఇవ్వడం ఆలస్యం జరగగా, సుమారు 16 ఏళ్ల తర్వాత ఎట్టకేలకు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కానీ, కాంట్రాక్ట్ పద్ధతిలోనే నియామకాలు చేపట్టారు. అయినా సరే, ప్రభుత్వం నుంచి అందే వేతనాలు కావడంతో జీవనానికి భరోసా ఉంటుందని భావించారు. దీంతో అప్పటివరకు చేస్తున్న ఉద్యోగాలు మాని ఉపాధ్యాయులుగా చేరారు. కానీ, ఒకటి కాదు రెండు కాదు.. నాలుగు నెలలైనా వచ్చే అరకొర వేతనం కూడా చెల్లించకపోవడంతో ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. అన్నింటికీ సర్దుకుపోతున్నా తమకు అందాల్సిన వేతనాల్లో జాప్యం చేయడంపై కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు ఆవేదన చెందుతున్నారు.

34 మంది

జిల్లాలో 2008 డీఎస్సీ అభ్యర్థులు 34 మందిని ఈ ఏడాది ఫిబ్రవరి 15వ తేదీన విధుల్లోకి తీసుకున్నారు. వీరిని జిల్లాలోని వివిధ పాఠశాలలకు కేటాయించగా పాఠాలు బోధిస్తున్నారు. నాలుగు నెలల పాటు ఉంటున్న ప్రాంతం నుంచి పాఠశాలలకు వెళ్లి వచ్చినా నెలనెలా వేతనాలు మాత్రం రావడం లేదు. ఇదంతా పక్కన పెడితే విద్యాసంవత్సరం చివరిలో ఆయా ఉపాధ్యాయులను టెర్మినేట్ చేసిన విద్యాశాఖ.. వేతనాల జారీలో మాత్రం జాప్యం చేస్తుండడం విమర్శలకు తావిస్తోంది. అయితే, వేతనాల విషయమై స్పష్టత ఇవ్వలేకపోతున్నప్పటికీ.. మళ్లీ పాఠశాలలు తెరవగానే వారిని విధుల్లోకి తీసుకునే అవకాశముందని చెబుతుండడంతో కొంత మేర ఊరట కలిగిస్తోంది.

వేతనాలు ఇవ్వాలి



కేజీబీవీలో సీఆర్టీ ఉద్యోగం మానేసి పాఠశాలలో చేరాను. ఇప్పటి వరకు వేతనాలు ఇవ్వకపోగా, ఏప్రిల్ 23న టెర్మినేట్ చేశారు. మిగతా కాంట్రాక్టు ఉద్యోగ, ఉపాధ్యాయులను మూడు రోజుల్లో విధుల్లోకి తీసుకున్నారు. ప్రభుత్వం మా ఆవేదనను అర్థం చేసుకుని వేతనాలు చెల్లించడమే కాక వెంటనే విధుల్లోకి తీసుకోవాలి.

–పి.ప్రశాంతి, పీఎస్, గోరిలపాడుతండా

కుటుంబ పోషణ కష్టంగా ఉంది..



2008 డీఎస్సీలో అర్హత సాధించిన మేం ఉపాధ్యాయులుగా విధుల్లో చేరాం. ఎంతో ఆశతో ఉద్యోగాలు చేస్తూ వచ్చాం. నాలుగు నెలల వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబాలు గడవడం కష్టమై ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ప్రభుత్వం మమ్మల్ని విధుల్లోకి తీసుకుని ఎండాకాలానికి కూడా వేతనాలు చెల్లించాలి.

–రేగళ్ల శేషు, పీఎస్, లచ్చగూడెం

రాష్ట్రస్థాయిలో పెండింగ్‌లో ఉంది..



2008 డీఎస్సీ కాంట్రాక్ట్ ఉపాధ్యాయులకు సంబంధించిన వేతనాల అంశం రాష్ట్రస్థాయిలో ఉంది. జిల్లాలో 34 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరందరికీ నాలుగు నెలలకు సంబంధించిన వేతనాలు ఇవ్వాల్సిన మాట వాస్తవమే. వేతనాలు, సర్వీస్ పునరుద్ధరణపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

–సామినేని సత్యనారాయణ, డీఈఓ

వల పన్ని.. పట్టుకున్నారు!

- స్టేషన్‌లో ఎఫ్‌ఓబీ పైనుంచి దూకేందుకు ఛత్తీస్‌గఢ్ యువకుడి యత్నం
- కింద వల అమర్చి కాపాడిన పోలీస్, అగ్నిమాపక శాఖ సిబ్బంది



బ్రిడ్జి కింద వలతో సిద్ధంగా ఉన్న ఉద్యోగులు



లలిత్‌ను స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

ఖమ్మంక్రైం: ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఓ యువకుడు మద్యం మత్తులో ఖమ్మం రైల్వేస్టేషన్‌లో శుక్రవారం హల్‌చల్ చేశాడు. ఫుట్‌ఓవర్ బ్రిడ్జి పైనుంచి దూకేందుకు యత్నించడం కలకలం రేపింది. ఈ ఘటనతో సుమారు గంటపాటు గందరగోళం నెలకొనగా, రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చివరకు ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ, అగ్నిమాపక శాఖ సిబ్బంది చొరవతో కింద వలలు ఏర్పాటుచేసి.. ఆ యువకుడిని తోసేయడంతో వలపై పడగా అంతా ఊపిరిపీల్చుకున్నారు.

మద్యం మత్తు.. కుటుంబ కలహాలు

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన వలస కార్మికుడు లలిత్ బరిహా ఖమ్మం సమీపాన గ్రానైట్ ఫ్యాక్టరీల్లో పనిచేస్తున్నాడు. కుటుంబ కలహాలతో మద్యం సేవించిన ఆయన ఆత్మహత్య చేసుకుంటానంటూ శుక్రవారం రైల్వేస్టేషన్‌కు వచ్చాడు. రెండో నంబర్ ప్లాట్‌ఫాం మీదుగా ఫుట్‌ఓవర్ బ్రిడ్జిపైకి ఎక్కి, దూకడానికి యత్నించాడు. బ్రిడ్జి కింద హైపర్ టెన్షన్ విద్యుత్ వైరు ఉండడం, అదే సమయానికి సికింద్రాబాద్‌కు వెళ్లే కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రానుండడంతో వేచి ఉన్న ప్రయాణికులు లలిత్‌ను గమనించి ఆర్పీఎఫ్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో సీఐ సురేశ్‌గౌడ్ ఆధ్వర్యాన సిబ్బంది చేరుకుని ఎంత నచ్చజెప్పినా వినకపోగా, పైకి ఎవరైనా వస్తే దూకుతానని బెదిరించాడు. ఆపై ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చి, బ్రిడ్జిపైకి ప్రయాణికులు వెళ్లకుండా ఆపివేశారు. ఇంతలో కోణార్క్ ఎక్స్‌ప్రెస్ వస్తుడడంతో ఖమ్మం ఔటర్‌లోనే నిలిపివేశారు. ఆ తర్వాత అగ్నిమాపక శాఖ సిబ్బంది చేరుకుని బ్రిడ్జి కింద వలలతో సిద్ధమయ్యారు. ఇదంతా సుమారు గంట దాటడంతో ఆర్పీఎఫ్ సిబ్బంది ఒకరు పైకి వెళ్లి లలిత్ తీగలపై పడకుండా వలలో పడేలా కిందకు తోశాడు. దీంతో ఆయన నేరుగా వలలో సురక్షితంగా పడటంతో ఆర్పీఎఫ్ స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ అనంతరం కుటుంబీకులకు సమాచారం అందించారు. కాగా, లలిత్ తీరుతో రైళ్లు నిలిచిపోవటంతో ఆయనపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. కాగా, ఆయన ప్రాణాలు కాపాడిన ఆర్పీఎఫ్, జీఆర్పీ, ఫైర్ సిబ్బందిని పలువురు అభినందించారు.

జేఏసీ పోరుబాటలో భాగస్వాములు కావాలి



బోనకల్: సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

మధిర/బోనకల్: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే పోరాటాల్లో ఉపాధ్యాయులంతా భాగస్వాములు కావాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు సూచించారు. మధిరలో జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాన్ని పరిశీలించడంతో పాటు బోనకల్ మండలం రావినూతల పాఠశాలలో శుక్రవారం జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. హక్కుల కోసం పోరాడుతూనే బడిబాటలో భాగంగా విద్యార్థుల సమోదు పెంచడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. కాగా, పీఆర్‌సీ అమలు, పెండింగ్ డీఏల సాధన కోసం యూనియన్ తరఫున కృషి చేస్తామని పేర్కొన్నారు. అలాగే, విద్యారంగ సంస్కరణలు ప్రభుత్వ పాఠశాలలను బలహీనపరిచేలా ఉండొద్దనేది తమ విధానమని తెలిపారు. కార్యక్రమాల్లో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రంగారావు, జిల్లా మాజీ అధ్యక్షుడు మోత్కూరి మధుతో పాటు ఆర్.బ్రహ్మారెడ్డి, తుమాటి కృష్ణారెడ్డి, రత్నకుమార్, చంద్రశేఖర్, సీహెచ్‌వీ రవికుమార్, శ్రీనివాసరావు, మల్లెల శ్రీనివాస్, శ్యామలరావు, స్వామి, మద్దినేని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెరగాలి



తల్లాడ : మాట్లాడుతున్న డీఈఓ సత్యనారాయణ

తల్లాడ: వచ్చే విద్యా సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య కచ్చితంగా పెరిగేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి సామినేని సత్యనారాయణ సూచించారు. తల్లాడలో జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణను శుక్రవారం పరిశీలించిన ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా నాణ్యమైన విద్య, యూనిఫాం, మధ్యాహ్న భోజనం అమలవుతుండడమే కాక సుశిక్షితులైన ఉపాధ్యాయులు ఉన్న విషయాన్ని వివరిస్తూ విద్యార్థులను చేర్పించాలని తెలిపారు. ఎంఈఓ ఎస్.దామోదరప్రసాద్, ఎంఎన్‌ఓ పి.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఏన్కూరులో..

ఏన్కూరు: అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో బాలబాలికల కోసం పాఠశాలలు తెరిచేనాటికి యూనిఫాం సిద్ధం చేయాలని డీఈఓ సామినేని సత్యనారాయణ సూచించారు. ఏన్కూరులో యూనిఫాం కుడుతున్న కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. అనంతరం ఏన్కూరు హరిజనవాడ, గంగులనాచారం, ఎస్టీ కాలనీ, నాచారం ఎస్టీ కాలనీ ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలకు యూనిఫాంలు అందజేశారు. ఎంఈఓ రహీమ్, కాంప్లెక్స్ హెచ్‌ఎం సైదయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్క్‌లో ప్రైవేట్ కళాశాలల సత్తా

దేశవ్యాప్తంగా నిర్వహించిన జేఈఈ మెయిన్స్ బీఆర్క్ అండ్ బీప్లానింగ్ ఫలితాలు గురువారం వెల్లడయ్యాయి. ఈ సందర్భంగా జిల్లాలోని పలు ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు జాతీయస్థాయి ర్యాంకులు సాధించారు. ఆయా విద్యార్థులను కళాశాలల యజమాన్యాలు అభినందించాయి.

– ఖమ్మంసహకారనగర్

రెజొనెన్స్ విద్యార్థికి ఆల్ ఇండియా 2వ ర్యాంక్



కార్తికేయను అభినందిస్తున్న డైరెక్టర్లు నాగేంద్రకుమార్, శ్రీధర్‌రావు

బీఆర్క్ అండ్ బీప్లానింగ్‌లో తమ విద్యార్థులు ఆలిండియాస్థాయి ర్యాంక్‌లతో ప్రభంజనం సృష్టించారని రెజొనెన్స్ కళాశాల డైరెక్టర్లు ఆర్‌వీ నాగేంద్రకుమార్, కొండా శ్రీధర్‌రావు తెలిపారు. పలువురు వివిధ కేటగిరీల్లో జాతీయస్థాయి ర్యాంక్‌లు సాధించగా.. కార్తికేయ ఆలిండియా స్థాయిలో రెండో ర్యాంక్ సాధించాడని వెల్లడించారు. అలాగే, భవగ్న్య 829, బి.రాకేశ్ 997, దివ్యతేజ 1,163, ధృవ 1,173, మణికుమార్ 1,400, వేదాంశ్ 1,500, శివాణి 1,740, ధాన్యదీప్ 2,170, భగవతి 2,586, నిహారిక 3,080, వీరవెంకటకృష్ణప్రసాద్‌నాయక్ 3,261, డి.గణేశ్ 3,496, ప్రవళిక 3,663, సాయిసుమన 3,690వ ర్యాంక్‌లు సాధించారని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు సతీశ్, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

కృష్ణవేణి విద్యార్థులకు ర్యాంక్‌లు



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

బీఆర్క్ అండ్ ప్లానింగ్ ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారని కృష్ణవేణి కళాశాల డైరెక్టర్లు గొల్లపూడి జగదీశ్, మాచవరపు కోటేశ్వరరావు, యార్లగడ్డ వెంకటేశ్వరరావు తెలిపారు. పి.మణిచంద్రసాయి 95వ ర్యాంక్, టి.తరుణ్ 242, ఎస్‌కే సమద్ 369, ఎల్.అభిజిత్ 676, డి.నిఖిల్ 681, టి.దినేశ్ 830, జి.దివ్య 833 సాధించారని వెల్లడించారు. అంతేకాక ఎస్.దినేశ్ 1,027, బి.చక్రవర్తి 1,059, ఆర్.గుప్తాశ్రీ 1,137, జె.జశ్వంత్ 1,202, జి.వినీత 1,266, డి.మహేశ్వర్ 1,308, కె.అభిషేక్ 1,420, బి.రాహుల్ 1,521, బి.రోహిత్‌గనీ 1,884, టి.గణేశ్ 2,189, టి.డిన్నీ 2,190, వి.సాత్విక 2,230, డి.రాజేశ్వరి 2,410, ఎస్.నేహిత 2,583, పి.యశస్వి 2,664, డి.సింధు 3,081, జి.సాహిత్ 3,259, కె.మహేశ్‌బాబు 3,301, కె.మౌనిక 3396, ఇ.శ్రీ సిరి 3,406, పి.తేజకుమార్ 3,530, కె.వెంకటసాయి నిఖిలేశ్ 3,542, డి.గీతశ్రీ 4,617,ఎం.వైష్ణవిరెడ్డి 4,847, ఎస్‌కే నారీస్ 4,925వ ర్యాంక్ సాధించారన్నారు. కార్య క్రమంలో ప్రిన్సిపాల్ రామచంద్రయ్య, అకడమిక్ డీన్ ఏలూరివంశీకృష్ణ, ఏటనిరంజన్‌కుమార్ పాల్గొన్నారు.

కొండరెడ్లకు గృహ నిర్మాణాలు

ఐటీడీఏ పీఓ రాహుల్



మాట్లాడుతున్న పీఓ రాహుల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): అటవీప్రాంతంలో నివసిస్తున్న కొండరెడ్ల గిరిజన కుటుంబాలకు పీఎం జన్‌ధన్ పథకం కింద ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు ఎంపీడీఓలు ప్రతిపాదనలు అందజేయాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం కలెక్టరేట్‌లో శుక్రవారం దమ్మపేట, అశ్వారావుపేట మండలాల ఎంపీడీఓలు, కొండరెడ్ల గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అశ్వారావుపేట మండలంలోని ఏడు హ్యాబిటేషన్లు, దమ్మపేట మండలంలోని పూసుకుంటలోని కొండరెడ్ల గిరిజన కుటుంబాల ఇంటింటికీ తిరిగి మొబైల్‌యాప్ ద్వారా శనివారం నుంచి సర్వే ప్రారంభించాలని ఆదేశించారు. ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల స్తూపం వద్ద నివాళి



ఛత్తీస్‌గఢ్‌లో ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావుతో సహా 27మంది మృతి చెందిన విషయం విదితమే. ఈమేరకు వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యాన నాయకులు శుక్రవారం ఖమ్మంలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఖమ్మంలోని అమరవీరుల స్తూపం వద్ద ఈ కార్యక్రమం జరిగింది.

–ఖమ్మంమయూరిసెంటర్

పెద్దబోటు సిద్ధం

కిన్నెరసాని జలాశయంలో పర్యాటకాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నడుపుతున్న పెద్ద బోటు 15 రోజుల క్రితం మరమ్మతులకు గురైంది. దీంతో హైదరాబాద్ నుంచి మెకానిక్‌లను పిలిపించి ఎట్టకేలకు రిపేర్ చేయించగా.. శుక్రవారం పర్యాటకులకు అందుబాటులోకి వచ్చింది. దీంతో పలువురు పర్యాటకులు ఉత్సాహంగా బోట్ షికారు చేశారు.

– పాల్వంచరూరల్



పెద్ద బోట్‌లో విహరిస్తున్న పర్యాటకులు

విద్యుదాఘాతంతో ట్రాక్టర్ డ్రైవర్ మృతి



కంభగిరి బలరాం (ఫైల్)

తల్లాడ: మండలంలోని మల్లవరంలో శుక్రవారం విద్యుదాఘాతంతో ట్రాక్టర్ డ్రైవర్ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కుంభగిరి బలరాం (45) దళితకాలనీ సమీపాన ఉన్న చికెన్ షాపు వెనకాల మూత్ర విసర్జనకు వెళ్లాడు. అయితే, ఆ ప్రాంతంలో ఉన్న విద్యుత్ వైర్‌ను తాకిన ఆయన షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. అక్కడ ఎవరూ లేకపోవడంతో విషయం బయటకు రాలేదు. మధ్యాహ్నం తర్వాత ఆయన మృతదేహాన్ని స్థానికులు గుర్తించి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. కాగా, బలరామ్‌కు భార్య సుశీల, ఇద్దరు పిల్లలు ఉండగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బంగారు ఆభరణాల చోరీ

తిరుమలాయపాలెం: మండల కేంద్రంలో తాళం వేసిన ఓ ఇంట్లో గుర్తుతెలియని దుండగులు చొరబడి పట్టపగలే బంగారు, వెండి వస్తువులు చోరీ చేసిన ఘటనపై శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. తిరుమలాయపాలెం గ్రామానికి చెందిన పగిళ్ల రామకృష్ణ తన భార్యతో కలిసి ఈ నెల 20న ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా ఇంట్లో బీరువా తెరిచి ఉండడంతో వెతికి చూడగా అందులోని సుమారు రూ.85 వేల విలువైన బంగారు ఆభరణాలు, వెండి వస్తువుల చోరీ జరిగినట్లు గుర్తించారు. దీంతో బాధితుడు చేసిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మల్లారంలో..

ముదిగొండ: మండలంలోని మల్లారంలో జరిగిన చోరీపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఘటనకు సంబంధించి పోలీసులు వెల్లడించిన వివరాలు... మల్లారం గ్రామానికి చెందిన బొగ్గారపు హనుమంతరావు గురువారం రాత్రి భోజనం అనంతరం ఆరు బయట పడుకోగా, ఆయన భార్య సుజాత దవరండాలో నిద్రించింది. అర్ధరాత్రి గాలివాన వస్తుండడంతో ఇరువురు ఇంట్లోకి వెళ్లగా ఇంటి మధ్య గది తలుపులు తెరిచి ఉండడమే కాక బీరువాలో భద్రపరిచిన బంగారు, వెండి ఆభరణాలు కనిపించలేదు. సుజాత తలదిండు కింద పెట్టిన తాళాలను గుర్తించిన దుండగులు వాటి సాయంతో బీరువా తెరిచి ఆభరణాలు దొంగిలించినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ముదిగొండ సీఐ ఓ.మురళి తెలిపారు.

గ్యాస్ లీకేజీతో మంటలు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం రోటరీనగర్‌లోని ఓ ఇంట్లో శుక్రవారం గ్యాస్ లీకేజీతో మంటలు చెలరేగాయి. ఇంట్లో నివాసముంటున్న వారు వంట చేసే క్రమాన స్టవ్ వెలిగించగా అప్పటికే గ్యాస్ లీక్ అయి ఉండడంతో మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో అప్రమత్తమైన వారు సిలిండర్‌ను బయటకు తీసుకొచ్చి నీళ్లు చల్లినా మంటలు అదుపులోకి రాలేదు. ఈక్రమాన ఏం జరుగుతోందని స్థానికులు ఆందోళనకు గురయ్యారు. అయితే, అప్పటికే అందిన సమాచారంతో అగ్నిమాపక శాఖ సిబ్బంది చేరుకుని మంటలను అదుపు చేయడంతో పెనుప్రమాదం తప్పినట్లయింది.